క్లుప్తంగా

మహిళ అదృశ్యం

పార్వతీపురం రూరల్: మండలంలోని అడారు గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 24 నుంచి ఆచూకీ లేవకపోవడంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సంతోషికుమారి తెలిపారు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు.

డ్రైవర్‌ను పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవిని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: తన డ్రైవర్ రవికి శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆస్పత్రిలో ఉన్న ఆయనను మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు పట్టణంలోని నీహాల్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులతో మాట్లాడారు. రవిత్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో దర్శనమిచ్చిన స్వామివారు

పార్వతీపురం టౌన్: జగముల నేలే జగన్నాథుడి రథోత్సవంలో భాగంగా రథయాత్ర వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి వారు కూర్మావతారంలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. గుండిచా మంటపంలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

రెండు కొండచిలువల హతం



హతమార్చిన కొండచిలువలను చూపిస్తున్న రైతులు

మక్కువ: మండల కేంద్రం మక్కువ నుంచి, శంబర గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలోని పంటపొలాల్లో రెండు కొండచిలువలను రైతులు ఆదివారం హతమార్చారు. స్థానిక రైతులు మావుడివారి పొలంలో రబీ వరిపంట చేనును మిషన్‌తో కోస్తుండగా, రెండు కొండచిలువలు పొలంలో దర్శనమిచ్చాయి. దీంతో రైతులు కొండచిలువలను హతమార్చి, రహదారిపైకి తీసుకురావడంతో వాటిని చూసిన జనం బాబోయ్ ఎంత పెద్ద పాములో అంటూ ఆశ్చర్యపోయారు.

ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బూరి తిరుమలరావు, తాండ్రోతు శ్రీనివాసరావు

పార్వతీపురం రూరల్: ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బూరి తిరుమలరావు, తాండ్రోతు శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన పార్వతీపురం మండల శాఖ సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు తెలియజేశారు.

పరామర్శ



రమేష్‌నాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని తాళ్లదుమ్మ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మండంగి రమేష్‌నాయుడును మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆదివారం కలిసి పరామర్శించారు. ఇటీవల రమేష్ నాయుడు కొడుకు మృతి చెందగా, ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆమె వెంట మండల కన్వీనర్ రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

బిక్కుబిక్కుమంటూ చదువులు

● శిథిలావస్థలో పాఠశాలలు



మరమ్మతులకు గురైన వరండాలో భోజనాలకు కూర్చున్న చిన్నారులు



శిథిలావస్థకు చేరుకున్న నగుళ్లు పాఠశాలలో చదువులు సాగిస్తున్న విద్యార్థులు



పెచ్చులూడి, ఇనుప ఊచలు కనిపిస్తున్న బాగుజోల పాఠశాల



కారిపోతున్న పాఠశాల భవనం

మక్కువ: మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు. వర్షం కురిస్తే భవనాలు కారిపోతున్నాయి. మరికొన్ని పాఠశాల భవనాలు బీటలు వారగా, పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు వేలాడుతున్నాయి. మండలంలోని 15జీపీఎస్‌లకు భవనాలు ఉండగా, వాటిలో నగుళ్లు, బొడ్డుసామంతవలస పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోగా, తాడిపుట్టి, చిలకమెండంగి గ్రామాల్లో పాఠశాలలు నిర్మాణాలకు నోచుకోలేదు. అలాగే మర్రివానివలస పాఠశాల వరండా మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు చదువులు, భోజనాలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

అన్న.. క్యాంటీన్ ఎక్కడ..?

● ఏడాదిగా పూర్తికాని భవన నిర్మాణం
● నేటి వరకు విడుదల కాని బిల్లు

సాలూరు:

టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేదవాడికి రూ.5కే భోజనం పెడుతున్నామని చెబుతున్న అన్న క్యాంటీన్ ఏర్పాటుపై సాలూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు మీనమేషాలు లెక్కిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్త్రీశిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఏడాదిగా ఈ క్యాంటీన్ ప్రారంభం కాలేదు. క్యాంటీన్ నిర్వహణ విషయం పక్కన పెడితే కనీసం క్యాంటీన్ భవన నిర్మాణమే నేటికీ పూర్తికాని పరిస్థితి. ఈ విషయంలో టీడీపీ నేతలకు ఉన్న చిత్తశుద్ధిపై ప్రజల నుంచి అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్యాంటీన్ నిర్మాణం కోసం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంత్రి సంధ్యారాణి గతేడాది ఆగస్టు 14న అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం



అన్న క్యాంటీన్ భవనానికి గతేడాది శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన అన్న క్యాంటీన్ భవన నిర్మాణం

వచ్చిన ఉత్సాహంలో ఈ పనులు ఓ కాంట్రాక్టర్ ప్రారంభించి శ్లాబ్ వేశారు. బిల్లులు పడకపోవడంతో సదరు కాంట్రాక్టర్ మిగిలిన పనులు చేపట్టలేక చేతులెత్తేయడంతో దీంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అయితే ఈ ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా నేటికీ ఈ భవనం బిల్లు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని తెలియవస్తోంది. సుమారు రూ.60 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ భవన నిర్మాణానికి బిల్లులు సీఎఫ్ఎంఎస్ నుంచి నిధి పోర్టల్‌లోకి మార్చడంతో బిల్లు చెల్లింపు మరింత ఆలస్యం అవుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో అన్న క్యాంటీన్ నిర్వహణ విషయం పక్కన పెడితే కనీసం భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా పార్వతీపురం మున్సిపాలిటీలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, మరి మంత్రిగా ఉన్న సంధ్యారాణి నియోజకవర్గంలో ఈ క్యాంటీన్ నేటికీ ప్రారంభం కాకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి అన్న క్యాంటీన్ భవన నిర్మాణం పూర్తిచేసి, క్యాంటీన్ ప్రారంభోత్సవం ఎప్పుడు చేస్తారో అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు



జానుమల్లువలసలో కాలువల్లో పూడికలు తీస్తున్న జేసీబీ

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా మండలంలోని గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలో సర్పంచ్‌ల పర్యవేక్షణలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆదివారం ఆయన జానుమల్లువలసలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే నిడగల్లు, నూరంపేట, మరిపివలస, చిన్నారాయుడుపేట, చినభోగిలి గ్రామాల్లో పారిశుధ్య పనులు జరిగాయన్నారు. అలాగే జానుమల్లువలస కాలువల్లో పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగించడం, పారిశుధ్య పనులు నిర్వహించడం, వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను దూర ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. సర్పంచ్ వై వెంకటనాయుడు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ సూచనల మేరకు గ్రామంలోదోమల బెడద నుంచి విముక్తి కల్పించడానికి పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే తాగునీరు సరఫరాపై జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పెంటయ్య మాస్టారి ఉద్యోగ విరమణ



పెంటయ్య మాస్టారు దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు తదితరులు

సాలూరు: పట్టణంలోని జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ మూకల పెంటయ్య మాస్టారి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. పెంటయ్య మాస్టారు, ఆయన సతీమణి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు లక్ష్మి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పెంటయ్య మాస్టారు గతంలో పనిచేసిన పాఠశాలలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. తమ గురువు నేర్పిన విద్యాబుద్ధుల వల్ల నేడు తాము ఈ స్థాయికి ఎదిగామని వివిధ రంగాల్లో మంచి స్థానాల్లో స్థిరపడిన గురుకుల పాఠశాల పూర్వవిద్యార్థులు పెంటయ్య మాస్టారును కొనియాడారు. అనంతరం మాస్టారును దుశ్శాలువాతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన విశ్రాంత జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయుడి సేవలు పదిలం



విశ్వేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పార్వతీపురం రూరల్: గురువు దగ్గర విద్యను అభ్యసించిన శిష్యులు ఉన్నంత వరకు ఆ ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ చేసినప్పటికీ విద్యార్థులకు అందించిన సేవలు పదిలంగా ఉంటాయని ఎంఈఓ-1 యందవ నిర్మల కుమారి అన్నారు. పార్వతీపురం మండలంలోని నర్సిపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చింతాడ విశ్వేశ్వరరావు ఉద్యోగ విరమణ సమావేశంలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ విశ్వేశ్వరరావు, భానుమతి దంపతులను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తన 29 సంవత్సరాల ఉద్యోగ కాలంలో విద్యార్థులకు చేసిన బోధన సంతృప్తినిచ్చిందన్నారు. తన తరఫున పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతితో కూడిన సీహెచ్‌వీఆర్ అవార్డులను ఏటా అందజేస్తానని ప్రకటించారు. చిన్నారులు భయంభక్తి కలిగి తల్లిదండ్రులు చెప్పినట్లు వింటూ పాఠశాలలకు సకాలంలో చేరుకుని గురువులు చెప్పే విద్యాబోధనను సక్రమంగా విని నేర్చుకోవాలని విశ్వరరావు విద్యార్థులకు సూచించారు.

ద్విచక్రవాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలి



వాహన చోదకుల నుద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహన చోదకులు విధిగా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన జాతీయ రహదారిలో హనుమాన్ జంక్షన్ వద్ద వాహన చోదకులు, విద్యార్థుల పేరెంట్స్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుపై ద్విచక్రవాహనంతో ప్రయాణం చేస్తున్న వారు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ లేకుండా రోడ్డు ప్రమాదాల బారిన పడిన వ్యక్తులు మృత్యువాత పడుతున్నారన్నారు. ఇంట్లో ఉన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి కోరి కష్టాలు తెచ్చుకోవద్దని హితవు పలికారు. గ్రామాల్లో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు సైబర్ నేరాలు నివారించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించుకోవాలని కోరారు. హెచ్‌సీ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటం తప్పదు..

● వీఆర్‌ఓల సంఘ పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు



మాట్లాడుతున్న వీఆర్‌ఓల సంఘ నాయకులు

పాలకొండ/పార్వతీపురం: రెవెన్యూ వ్యవస్థను అపహాస్యం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడితే పోరాటం తప్పదని వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు మరడ సింహాచలం, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు వంజరాపు రమేష్ అన్నారు. పార్వతీపురం ఎన్‌జీఓ కార్యాలయంలో పార్వతీపురం మన్యం జిల్లా వీఆర్‌ఓల సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయాల క్రమబద్ధీకరణకు తాము వ్యతిరేకం కాదని తెలిపారు. ఇదే అవకాశంగా మూడు, నాలుగు గ్రామాలను ఒక క్లస్టర్‌గా చేసి వీఆర్‌ఓను నియమించడం సమంజసం కాదన్నారు. దీని వల్ల ప్రజలకు సకాలంలో సేవలు అందించలేమని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో 10 నుంచి 15 గ్రామాలకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. 90 శాతం సేవలు రెవెన్యూ నుంచి అందించాల్సి ఉన్న నేపథ్యంలో రేషనలైజేషన్ నుంచి వీఆర్‌ఓలను తప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓల సంఘ నాయకులు బంకి రాజా, బెహరా మురళీ, రఘుకుమార్, బాసూరు శ్రీనివాసరావు, సీమన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊటలు ధ్వంసం

సీతంపేట: మండలంలోని చిన్నబెత్తుపురం పరిసర ప్రాంతాల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1200 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్సై వై. అమ్మన్నరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు చేపట్టి సారా తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

సారా బట్టీ..

భామిని: మండలంలోని బిచ్చుమానుగూడలో బత్తిలి ఎస్సై ఎ.అప్పారావు ఆధ్వర్యంలో పోలీస్‌లు సారా బట్టీని ఆదివారం ధ్వంసం చేశారు. సుమారు రెండు వేల లీటర్ల బెల్లం ఊట, వెయ్యి లీటర్ల సారా ఊటలను పారబోశారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

సీతంపేట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఆదివారం స్థానిక అడ్వంచర్ పార్కు సమీపంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘాట్‌రోడ్‌లో డ్రైవింగ్ చేసే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ కంప్యూటర్ విద్య

భామిని: ప్రతి విద్యార్థికి కంప్యూటర్ విద్య అవసరమని కొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్, ప్రముఖ వ్యాపారి గుడ్ల కృష్ణారావు, సానుపిల్లి కాశీబాబు అన్నారు. మండలంలోని ఘనసర అబ్దుల్ కలాం డ్రీమ్స్ కంప్యూటర్స్ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆదివారం ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సెంటర్ ఏర్పాటు చేసి 20 గ్రామాలకు చెందిన 640 మందికి కంప్యూటర్ శిక్షణ అందించినట్లు హెచ్‌ఎం కొనపల నీలకంఠం తెలిపారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు వై.అప్పలనాయడు, వలరౌతు ప్రసాదరావు, గ్రామ పెద్దలు పాపల్గొన్నారు.

'ఒట్టిగెడ్డ'ను వేధిస్తున్న సిబ్బంది కొరత

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని ప్రధాన సాగునీటి వనరుగా పేరొందిన ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌ను సిబ్బంది కొరత గత కొంతకాలంగా వేధిస్తోంది. ప్రస్తుతం సరిపడ సిబ్బంది లేని కారణంగా ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు వెంబడి పూడికలు, పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో కాలువలకు గండ్లు పడడంతో శివారు భూములకు సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాజెక్టు కుడికాలువ ద్వారా 13,324 ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా 3360 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు జరుగుతున్నందున సాగునీరు సక్రమంగా అందివ్వాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే వాస్తవంగా ఈ ప్రాజెక్టులో 13 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ఒక మెస్ మజ్దూర్, హెడ్ మజ్దూర్‌తో పాటు ఇంకొకరు పనిచేస్తున్నారు. సిబ్బంది కొరత వల్లే నిర్వహణ సక్రమంగా లేదని, దీంతో రైతులకు సాగునీటి కష్టాలు అధికమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

తాగునీటి స్వచ్ఛత పరీక్షలు చేయండి



వనజ గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం

జియ్యమ్మవలస రూరల్: తాగునీటి స్వచ్ఛత పరీక్షలు చేయాలని మండలంలోని వనజ గ్రామస్తులు కోరుతున్నారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న నీరు కలుషితమవుతోందని, ఆ నీరు తాగడం వల్ల పలువురు అనారోగ్యం బారినపడి ఆస్పత్రిపాలవుతున్నారని ఊయక నరేష్, ఆరిక తిరుపతిరావులు తెలిపారు. 20 వేల నీటి సామర్థ్యం కలిగిన రక్షిత మంచి నీటి ట్యాంకు కింద ప్లాట్‌ఫాం లేదని, ఆ కింది నుంచే మురుగుకాలువ ద్వారా మురుగు ప్రవహిస్తోందన్నారు. దీంతో అక్కడి భూగర్భజలం కలుషితమవుతోందని అధికారులు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే తాగునీటి స్వచ్ఛత పరీక్షలు చేసి, గ్రామస్తుల అనారోగ్యానికి గల కారణాలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వారాల పండగ

రామభద్రపురం: మండల కేంద్రంలో చొక్కాపు వీధి వాసులు దేశతల్లి అమ్మవారి వారాల పండగా ఆదివారం ఘనంగా నిర్వహించారు.మహిళలు కలశాలతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా గ్రామ పొలిమేరలకు చేరుకుని పూజలు చేశారు. అమ్మవారికి పరమాన్నం, పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.